మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 55 ఆదివారం 27 - 07 - 2025 పేజీలు: 8 వెల: 4

## పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలి




3లో..



## మర్యాదపూర్వక భేటీ

(మన గళం న్యూస్ నెట్ వర్క్) : రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పీ.వి.ఎన్.మాధవ్ దేశ రాజధాని ఢిల్లీలో బిజీ బిజీగా మారారు. శనివారం కేంద్ర భారీ పరిశ్రమలు,ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మతో కలిసి గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.

### గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు

## ప్రమాణస్వీకారం



మన గళం, పనాజీ: మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు .. ఇవాళ గోవా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. పీఎస్ శ్రీధరన్ పిళ్లై స్థానంలో ఆయన ఆ బాధ్యతలను స్వీకరించారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే .. ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌తో పాటు ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇవాళ ఉదయం 11.30 నిమిషాలకు ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. అశోక్ గజపతి రాజు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించారు. రాజకీయవేత్తగా ఆయనకు వివాదరహితుడిగా పేరుంది. గతంలో ఏడు సార్లు ఎమ్మెల్యేగా ఆయన విజయం సాధించారు. 2014లో విజయనగరం ఎంపీగా గెలుపొందారు. మోదీ క్యాబినెట్‌లో విమానయానశాఖ మంత్రిగా

2 లో..




### కాల్పుల విరమణకు పిలుపునిచ్చిన

## కాంబోడియా

- థాయిలాండ్, కంబోడియా మధ్య ఘర్షణలు
- ఐక్యరాజ్యసమితిలో వాడీవేడిగా చర్చ

మన గళం డెస్క్ : కంబోడియా మరియు థాయిలాండ్ మధ్య సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఘర్షణల్లో మృతుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ నేపథ్యంలో కంబోడియా తక్షణ కాల్పుల విరమణకు పిలుపునిచ్చింది. కంబోడియా తక్షణ మరియు బేషరతు కాల్పుల విరమణను కోరుతోందని, దీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదానికి శాంతియుత పరిష్కారం కోసం చూస్తోందని ఆ దేశ వర్గాలు

2 లో..

## సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటన షెడ్యూల్ ఖరారు



మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈ మేరకు సీఎంవో కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇవాళ (శనివారం, జులై 26) రాత్రి 11 గంటలకు హైదరాబాద్ నుంచి సింగపూర్ వెళ్లనున్నారు. 27వ తేదీ ఉదయం 6 గంటలకు సింగపూర్ ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు సీఎం చంద్రబాబు బృందం. సీఎం చంద్రబాబుతో సింగపూర్ పర్యటనలో మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, పీ.నారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొననున్నారు. బ్రాండ్ ఏపీ ప్రమోషన్‌తో పెట్టుబడుల సాధన కోసం రేపటి నుంచి ఐదు రోజుల పాటు సింగపూర్‌లో పర్యటించనున్నారు. ప్రముఖ సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలతో భేటీ కానున్నారు. మొదటి రోజు సింగపూర్‌లో తెలుగు డయాస్పోరా ఫ్రం సౌత్ ఈస్ట్ ఏషియా కార్యక్రమంలో పాల్గొంటారు. సింగపూర్‌తో పాటు మలేషియా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ , థాయ్‌లాండ్‌తో సహా పలు దేశాల నుంచి తెలుగు పారిశ్రామిక వేత్తలు, వివిధ కంపెనీల ప్రతినిధులు, పెట్టుబడుదారులు, ఉద్యోగులు హాజరుకానున్నారు. ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి దాదాపు 1500 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. సింగపూర్‌లోని వన్‌వరల్డ్ ఇంటర్ నేషనల్ స్కూల్‌లో సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిరుద్యోగ యువతకు ఇండియాలోనే కాకుండా వివిధ దేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై చర్చించనున్నారు. వివిధ దేశాల్లో ఉన్న తెలుగు వారిని ఏపీ అభివృద్ధిలో భాగస్వాములు చేయడం వంటి అంశాలపై సమావేశంలో మాట్లాడనున్నారు. జీరో పావర్టీ -4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని తెలుగు పారిశ్రామిక వేత్తలు, ఎన్ఆర్ఐలను కోరనున్నారు. పలు దేశాలకు ఏపీ నుంచి ఎగుమతులు పెంచడానికి ఎన్నారైల ద్వారా అవసరమైన ప్రణాళికలు అమలు చేయడంపై చర్చించనున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచడంపై మాట్లాడనున్నారు. స్పోర్ట్స్, పోర్ట్స్ సహా వివిధ మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ కేంద్రాలను సీఎం చంద్రబాబు బృందం సందర్శించనున్నారు..

### కదులుతున్న అంబులెన్స్‌లో

## అత్యాచారం



మన గళం, ఇంటర్నెట్ డెస్క్: పాట్నా: హోంగార్డు సెలక్షన్ కోసం హాజరైన మహిళ భౌతిక పరీక్షలో స్పృహ కోల్పోయింది. ఆమెను హాస్పిటల్‌కు తరలిస్తుండగా కదులుతున్న అంబులెన్స్‌లో నలుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఎన్డీయే అధికారంలో ఉన్న బీహార్‌లో ఈ దారుణం జరిగింది. జూలై 24న బోధ్ గయలోని బీహార్ మిలిటరీ పోలీస్ గ్రౌండ్‌లో హోంగార్డుల నియామకం కోసం ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో

2 లో..



### ఏడు నెలల్లో మావోయిస్టులంతా

## లొంగిపోవాలి

### ఏపీ డీజీపీ హరీశ్ గుప్తా



మన గళం, అమరావతి : ఏపీ డీజీపీ హరీశ్ గుప్తా ఎదుట మావోయిస్టు దంపతులు కమలేశ్-అరుణ లొంగి పోయారు. వీరిలో కమలేశ్‌పై రూ.20 లక్షలు, అరుణపై రూ.5లక్షల రివార్డు ఉందని డీజీపీ తెలిపారు. ఈ మేరకు మీడియాకు వివరాలు వెల్లడించిన హరీశ్‌గుప్తా.. ఏవోబీ పరిధిలో భారీ ఆయుధాల డంప్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఏకే 47, హ్యాండ్ గ్రనేడ్లు, ఇతర ఆయుధాల స్వాధీనం చేసుకున్న వాటిలో ఉన్నా యని చెప్పారు. మావోయిస్టుల కదలి కలపై ఎప్పటికప్పుడు సమాచారం అందుకుని జాయింట్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని డీజీపీ హరీశ్ గుప్తా తెలిపారు. ఏపీకి చెందిన దాదా పు 21 మంది ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఇతర రాష్ట్రాల్లో మావోయిస్టు సభ్యులుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మావోయిస్టులు హింసను వీడాలని ఆయన పిలుపుని చ్చారు. వారంతా వచ్చే ఏడు నెలల్లో అంటే వచ్చే మార్చి లోగా లొంగిపోవాలని కోరారు. మావోయిస్టులంతా జనజీవన స్రవం తిలోకి వస్తే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వారంతా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు హింసను వీడాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా వచ్చే ఏడు నెలల్లో అంటే వచ్చే మార్చి లోగా లొంగిపోవాలని కోరారు. మావోయిస్టు లంతా జనజీవన స్రవంతిలోకి వస్తే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వారంతా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

### ఏపీకి వచ్చే 3 రోజులు

## భారీ రెయిన్ అలెర్ట్



మన గళం, అమరావతి : నిన్నటి వాయుగుండం గత 6 గంటల్లో గంటకు 28 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా కదిలి, జూలై 26న ఉదయం 8.30 గంటలకు ఉత్తర ఛత్తీస్‌గఢ్ దాని పరిసర ప్రాంతాలపై, దాదాపుగా 23.3లీఉత్తర అక్షాంశం, 84.0లీతూర్పు రేఖాంశం ల దగ్గర కేంద్రీకృతమై ఉంది. డాల్టన్‌గంజ్ (జారండ్)కి దక్షిణంగా 80 కి.మీ., అంబికాపూర్ (ఛత్తీస్‌గఢ్)కి తూర్పున 80 కి.మీ.. పెంద్రా రోడ్ (ఛత్తీస్‌గఢ్)కి తూర్పు ఈశాన్యంగా 220 కి.మీ. ఉమారియా (మధ్యప్రదేశ్)కి తూర్పున 320 కి.మీ. దూరంలో ఉంది. ఇది ఉత్తర ఛత్తీస్‌గఢ్, తూర్పు మధ్యప్రదేశ్ మీదుగా దాదాపు పశ్చిమ దిశగా కదులుతూ, జూలై 27, 2025 నాటికి క్రమంగా బలహీనపడి బాగా గుర్తించబడిన అల్పపీడన ప్రాంతంగా మారే అవకాశం ఉంది.

2 లో..

## కోబ్రాను కొరికి చంపిన ఏడాది బుడ్డోడు



మన గళం డెస్క్ : బీహార్ రాష్ట్రంలోని బెట్టియాహ్ గ్రామంలో ఓ ఏడాది వయస్సున్న బుడ్డోడు నాగుపాముచు కొరికి చంపిన విచిత్ర సంఘటన చోటుచేసుకుంది. గోవిందా అనే చిన్నారి ఇంటి బయట ఆడుకుంటుండగా ఓ కోబ్రా పాము అతడి చేతిపై చుట్టుకుంది. ఆ సమయంలో బొమ్మ అనుకుని గోవిందా ఆ పామును బలంగా కొరికేశాడు. చిన్నారి కాటుతో ఆ విషపూరిత పాము అక్కడికక్కడే మృతి చెందింది. తర్వాత చిన్నారి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో అతడి కుటుంబ సభ్యులు వెంటనే

2 లో..

### జంట హత్యల కేసులో ప్రధాన

## నిందితుడుగా వైసీపీ నేత

- ఈ నెల 23న నరసరావుపేటలో తండ్రీకొడుకుల కిడ్నాప్, హత్య



మన గళం, పల్నాడు జిల్లాలో ఇటీవల జరిగిన జంట హత్యలు తీవ్ర కలకలం రేపిన విషయం విదితమే. ఈ కేసులో నిందితులను పోలీసులు గుర్తించారు. ఈ నెల 23న నరసరావుపేటలో ఇద్దరు రియల్టర్లు (తండ్రీకొ డుకులు) దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్యలకు సూత్రధారి వైకాపా నేత బాదం మాధవరెడ్డి అని పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా

2 లో..

### టీఆర్ఎఫ్‌ను ఉగ్రసంస్థగా

## ప్రకటించిన అమెరికా

### ఎలాంటి అభ్యంతరం లేదన్న పాక్




మన గళం, న్యూఢిల్లీ : పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడిన పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే నిషేధిత ఉగ్రసంస్థ, లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)ను ఇటీవల అమెరికా ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన విషయం తెలిసిందే.

2 లో..

# కాల్పుల విరమణకు పిలుపునిచ్చిన కాంబోడియా



పేర్కొన్నాయి. ఈ ఘర్షణలు ప్రాథమికంగా ప్రెయా విహార్ మరియు ప్రసాత్ తా మ్యూన్ థామ్ దేవాలయాల చుట్టూ కేంద్రీకృతమయ్యాయి, ఇరు దేశాలు పరస్పరం రాకెట్లు మరియు ఫిరంగి దాడులు చేసుకున్నాయి. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఈ ఘర్షణలపై చర్చ జరగ్గా... కంబోడియా విచక్షణారహిత మరియు అమానవీయ దాడులు చేసిందని థాయిలాండ్ ఆరోపించింది. అయితే, కంబోడియా రాయబారి థాయిలాండ్ వాదనను తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. తాము సంయమనం పాటిస్తున్నామని, దౌత్య మార్గాల ద్వారానే సమస్య పరిష్కారం కావాలని కోరుకుంటున్నామని నొక్కి చెప్పారు. ఘర్షణల కారణంగా కంబోడియాలో ఎనిమిది మంది సైనికులతో సహా కనీసం 13 మంది మరణించారు. 35,000 మందికి పైగా ప్రజలు తమ ఇళ్లను వదిలి వెళ్ళవలసి వచ్చింది. థాయిలాండ్‌లో 15 మంది మరణించారు... 46 మంది గాయపడ్డారు. సరిహద్దు ప్రాంతాల నుంచి 138,000 మందికి పైగా ప్రజలను తరలించారు. మే నెలలో కంబోడియా సైనికుడు చంపబడిన తర్వాత చెలరేగిన ప్రస్తుత సంక్షోభం, సుదీర్ఘకాలంగా సాగుతున్న వివాదానికి కొనసాగింపు అని చెప్పాలి. 2008 మరియు 2011 మధ్య గతంలో కూడా ఘోరమైన ఘర్షణలు జరిగాయి. 11వ శతాబ్దపు ప్రెయా విహార్ హిందూ దేవాలయంపై కంబోడియా సార్వభౌమత్వాన్ని 1962 అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు ధృవీకరించినప్పటికీ, అది వివాదానికి కేంద్ర బిందువుగా ఉంది.

# టీఆర్‌ఎఫ్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించిన అమెరికా

అయితే, అగ్రరాజ్యం నిర్ణయంపై తాజాగా పాకిస్థాన్ స్పందించింది. టీఆర్‌ఎఫ్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపింది. ఈ మేరకు ఆ దేశ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ వెల్లడించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో నిన్న ఇషాక్ దార్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాక్ మంత్రి మాట్లాడుతూ.. 'టీఆర్‌ఎఫ్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించే సార్వభౌమాధికారం అమెరికాకు ఉంది. యూఎస్ నిర్ణయంతో మాకు ఎలాంటి సమస్య లేదు. వారి ప్రమేయం ఉందని ఆధారాలు ఉంటే అలా చేయొచ్చు. మేము స్వాగతిస్తాము' అని వాషింగ్టన్ డీసీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఇషాక్ దార్ తెలిపారు. అయితే, టీఆర్‌ఎఫ్‌కు లష్కరే తోయిబాకు ముడిపెట్టడం మాత్రం తప్పని ఆయన పేర్కొన్నారు. ఆ సంస్థను తాము కొన్నేళ్ల క్రితమే కూల్చేశామన్నారు. కాగా, ఏప్రిల్ 22న జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన విషయం తెలిసిందే. బైసరాన్ వ్యాలీలో పర్యాటకులే లక్ష్యంగా విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దేశం మొత్తాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మొదట ఈ మారణహోమానికి తామే బాధ్యులమని టీఆర్‌ఎఫ్ ప్రకటించుకుంది. కానీ, ఆ తర్వాత మాట మార్చేసింది. ఇక, ఈ దాడి తర్వాత టీఆర్‌ఎఫ్‌ను అమెరికా అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. అటు, 2023 జనవరిలో



చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం కింద భారత్ కూడా టీఆర్‌ఎఫ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన విషయం తెలిసింవదే.

# ఏపీకి వచ్చే 3 రోజులు భారీ రెయిన్ అలెర్ట్

ఈశాన్య అరేబియా సముద్రం నుండి ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా జారండ్ దాని పరిసర ప్రాంతాల మీద గల వాయుగుండం కేంద్రం వరకు సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తులో ఉన్న నిన్నటి ద్రోణి ఈరోజు తక్కువగా గుర్తించబడినది. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు..

ఈరోజు : తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది . ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 40–50 కి.మీ. వేగం తో వీచే అవకాశం ఉంది.



తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 40 –50 కి.మీ. వేగం తో వీచే అవకాశం ఉంది తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 40 –50 కి.మీ. వేగం తో వీచే అవకాశం ఉంది. తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 40 –50 కి.మీ. వేగం తో వీచే అవకాశం ఉంది తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన గాలులు గంటకు 40 –50 కి.మీ. వేగం తో వీచే అవకాశం ఉంది తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 40 –50 కి.మీ. వేగం తో వీచే అవకాశం ఉంది

# జంట హత్యల కేసులో ప్రధాన నిందితుడుగా వైసీపీ నేత

నిర్ధారణకు వచ్చారు. కిడ్నాప్, హత్యలో మాధవరెడ్డితో పాటు మరో ఆరుగురు పాల్గొన్నట్లు గుర్తించారు. మాధవరెడ్డి గతంలో దర్శి నియోజకవర్గ వైకాపా ఇన్?ఛార్జిగా బాధ్యతలు నిర్వహించారు. బెంగళూరులో నివాసం ఉంటున్న కె. వీరస్వామి రెడ్డి (62), ఆయన కుమారుడు కె.వి. ప్రసాదరెడ్డి (37) ఇటీవల కోర్టు పని మీద పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణానికి వచ్చారు. ఈ నెల 23న ఉదయం వారు కోర్టుకు బయలుదేరుతుండగా, వాహనంలో వచ్చిన ఆరుగురు వ్యక్తులు తండ్రీకొడుకులను కిడ్నాప్ చేశారు. అనంతరం అక్కడి నుంచి వారిని పాతమాగులూరులోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లోకి తీసుకెళ్లి ఇద్దరినీ దారుణంగా హత్య చేసి పారిపోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# కదులుతున్న అంబులెన్స్‌లో సామూహిక అత్యాచారం

పాల్గొన్న 26 ఏళ్ల మహిళ స్పృహ కోల్పోయింది. వెంటనే స్పందించిన అధికారులు అక్కడున్న అంబులెన్స్‌లో ఆమెను హాస్పిటల్‌కు తరలించారు. కాగా, స్పృహ కోల్పోయిన ఆ మహిళపై కదులుతున్న అంబులెన్స్‌లో నలుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. హాస్పిటల్‌కు తరలించిన తర్వాత వైద్య సిబ్బంది, పోలీసులకు ఆ మహిళ ఫిర్యాదు చేసింది. ఆమె స్టేట్‌మెంట్ ఆధారంగా బోధ్ గయ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేశారు. ఆధారాల సేకరణకు ఫోరెన్సిక్ బృందాన్ని నియమించారు. మరోవైపు అంబులెన్స్ కదలికలు, హాస్పిటల్‌కు చేరుకున్న సమయానికి సంబంధిన ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. కదులుతున్న అంబులెన్స్‌లో అపస్మారక స్థితిలో ఉన్న ఆ మహిళపై గ్యాంగ్‌రేప్ జరిగినట్లు నిర్ధారించారు. అంబులెన్స్ డ్రైవర్ వినయ్ కుమార్, టెక్నీషియన్ అజిత్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. పోలీస్ కస్టడీలో ఉన్న వారిద్దరిని ప్రశ్నిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.

# కోబ్రాను కొరికి చంపిన ఏడాది బుడ్డోడు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ బెట్టియాహ్‌కు తరలించారు. వైద్యులు గోవిందా ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని.. వైద్య పర్యవేక్షణలో ఉంచామని తెలిపారు. చిన్నారి తల్లి కట్టెల కోసం ఇంటి పక్కనే ఉన్న సమయంలో ఈ ఘటన జరిగిందని.. అప్పుడు ఆమెను పిలిచి సమాచారం అందించామని గోవిందా బామ్మ మతేశ్వరి దేవి చెప్పారు. ఈ ఘటన గ్రామంలో అందరినీ ఆశ్చర్యపరిచింది. అంత చిన్నోడు నాగుపామును ఎలా చంపగలిగాడో అని స్థానికులు ఆశ్చర్యపోతున్నారు.

# గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు ప్రమాణస్వీకారం

విధులు నిర్వర్తించారు. మహారాజా అలక్‌నారాయణ విద్యాసంస్థలను అశోక్ గజపతి రాజు నిర్వహిస్తున్నారు. మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. గతంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా అశోక్ గజపతి రాజు చేశారు. ఎన్టీఆర్, చంద్రబాబు కేబినెట్‌లలో కీలక మంత్రిత్వ శాఖలను ఆయన చేపట్టారు

# మరో విమానం ప్రమాదం..

మన గళం డెస్క్ : ఇటలీలో ఘోర విమానం ప్రమాదం చోటుచేసుకుంది. ఒక చిన్న విమానం హైవేపై కూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. బ్రెసికా సిటీ సమీపంలో ఈ ఘటన జరిగింది. చిన్న తరహా అల్ట్రాలైట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఉన్నట్టుండి రోడ్డుపై కుప్పకూలింది. దీంతో విమానం కూలిన తర్వాత భారీగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో పైలట్ సహా ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. బహుశా విమానం కంట్రోల్ తప్పి ఉంటుందని, ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేద్దామనుకున్న సమయంలో.. ఆ ఫ్లైట్ నోస్‌డైవ్ చేసి ఉండొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కిందకు డైవ్ చేసిన ఆ విమానం హైవేను ఢీకొట్టింది. ఫ్రేషియా ఆర్జీ అల్ట్రాలైట్ విమానాన్ని కార్బన్ ఫైబర్‌తో తయారు చేశారు. వింగ్ వెడల్పు 30 ఫీట్లు ఉంటుంది. చాలా వేగంగా ఆ విమానం రోడ్డును ఢీకొనడం సీసీటీవీ ఫుటేజీలో రికార్డయింది. విమానం పేలిన సమయంలో ఇద్దరు బైకర్లు గాయపడ్డారు.

# కోల్‌కతా, హౌరా నుంచి విలస చేపల్ని తెచ్చి విక్రయం

**- పులసలు కాదు 'విలసలు' వాటినే విక్రయిస్తున్న వ్యాపారులు - మార్కెట్లో సైజును బట్టి రూ.600 నుంచి రూ.1300ల ధర**

మన గళం, విజయవాడ :గోదావరిలో పులస చేపల జాడ లేకపోయినా, యానాం మార్కెట్లో మాత్రం ఇవి పుష్కలంగా లభ్యమవుతున్నాయి. మత్స్యకారుల వలలకు చిక్కకుండా ఇవి ఎక్కడి నుంచి వచ్చాయో అని ఆశ్చర్యపోకండి. ఈ చేపలకు ఉన్న భారీ డిమాండ్?ను కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కోల్‌కతా, హౌరా నుంచి విలస చేపల్ని తెచ్చి ఇక్కడ అమ్ముతున్నారు. ప్రస్తుతం అక్కడి మార్కెట్లో సైజును బట్టి రూ.600 నుంచి రూ.1300 వరకు ధర పలుకుతున్నాయి. బంగాళాఖాతంలో వేటాడే విలసలను హౌరా పరిసరాల నుంచి రైలు మార్గంలో కాకినాడకు తీసుకువస్తున్నారు. అక్కడి నుంచి గూడ్స్ ఆటోల్లో వివిధ ప్రాంతాలకు తరలించి అమ్ముతున్నారు. రంగు, వాసన ఒకేలా ఉన్నప్పటికీ: రంగు, వాసన ఒకేలా ఉండే విలస, పులస చేపల్లో రుచి, తాజాదనంలో తేడా ఉంటుంది. గోదావరిలో దొరికే పులస తాజాగా వండినప్పుడు ఎంతో రుచికరంగా ఉంటుంది. నాలుగైదు రోజులు ముందు పట్టిన విలస తాజాగా ఉండదు. రుచిలోనూ వ్యత్యాసం తెలుస్తుంది. తాజాదనాన్ని గుర్తించి వాటి మధ్య తేడాను తెలుసుకోగలం. సంతానోత్పత్తి కోసం గోదావరిలోకి ప్రవేశించే పులస వరదనీటిలో పలు పదార్థాలను తింటూ ధవళేశ్వరం బ్యారేజీ మీదుగా భద్రాచలం వరకు ప్రయాణిస్తుంది. ఈ క్రమంలో ఎగువకు వెళ్లే కొద్దీ రుచి పెరుగుతుంది. ధవళేశ్వరం, రాజమహేంద్రవరం మార్కెట్లో దొరికే పులసలకు ఎక్కువ రుచి ఉంటుంది. మత్స్యకారుల అంచనాలు: పులసల సీజన్ వచ్చిందంటే చాలు యానాం ప్రాంతానికి చెందిన మత్స్యకారులు గుంపులుగా గోదావరిలో వేట సాగిస్తూ కనిపిస్తుంటారు. ప్రస్తుతం వీరు ఎక్కడా కనిపించడం లేదు. గతంలో నిత్యం రూ.లక్షల్లో వ్యాపారం సాగేది. కొద్ది వారాలుగా పులస లభ్యత లేకపోవడంతో కోల్‌కతా నుంచి తెచ్చిన విలసలనే అమ్ముతున్నారు. ఆగస్టులోనైనా పులసలు దొరక్కపోతాయా అని ఆశతో ఎదురుచూస్తున్నారు.

మరోవైపు రానురాను పులస చేపల లభ్యత తగ్గిపోతోంది. పెద్ద పెద్ద వలలతో వేటాడితే పెద్ద చేపలు పడి ఎక్కువ డబ్బులు వస్తాయనే ఆలోచనలో జాలర్లు



ఉన్నారు. దీనివల్ల తల్లి చేపకు నష్టం వాటిల్లి ఆ ప్రభావం వాటి ఉత్పత్తిపై పడుతుంది. సముద్రంలో పిల్ల పులసలనే వేటాడం, సంతానోత్పత్తి సమయంలో వేట, జలకాలుష్యం ఇతరత్రా కారణాలతో వీటి లభ్యత ఏడాదికేడాది తగ్గిపోతుందని గణాంకాలు చెబుతున్నాయి. ఇవి దొరకటం తగ్గిపోతున్న క్రమంలో ధరలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ చేపల ఉత్పత్తి తగ్గిపోవడానికి గల కారణాలపై పరిశోధనలు జరుగుతున్నాయి.

**- పుస్తెలమ్మైనా పులస కొని తినాల్సిందే :**

పుస్తెలమ్మైనా పులస కొని తినాల్సిందే అన్నది ఉభయ గోదావరి జిల్లాలో ఉన్నా నానుడి. గోదావరికి వర్షాకాలం బురదనీరు వచ్చిందంటే పులసల చేపల సీజన్ మొదలైయినట్లే మరి. ఈ సీజన్ జులై నుంచి అక్టోబరు వరకు ఉంటుంది. యానాం రేవులో వేలం పాటకు కిలో పైగా బరువున్న పులస విక్రయానికి వస్తే, దానిని స్థానిక మత్సకార మహిళ పొన్నమండ రత్నం రూ.15,000లకు దక్కించుకున్నారు. అలాగే తిరిగి దానిని రూ.18,000లకు అమ్మకానికి పెట్టారు. అయితే ఈ సీజన్‌లో యానాం మార్కెట్‌కు పులస రావడం కూడా ఇదే తొలిసారి. పైగా మంచి ధర పలకడంతో జాలర్లకు సంతోషం కలిగించింది. మరోవైపు రెండు రోజుల క్రితమే మరో పులాస చేప రూ. 10,000 కు అమ్ముడైనట్లు తెలుస్తోంది. అదే విధంగా యానాంలో మంగళవారం రెండు కిలోల బరువున్న పులస చేప వేలంలో రూ. 26,000 ధర పలికింది. ఈ పులసను ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన బెజవాడ సతీష్ దక్కించుకున్నారు. దీన్ని బట్టి పులసకు ఉన్న డిమాండ్ ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## వర్ణా స్కిన్ కేర్ ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే గౌరు



మనగళం, కర్నూలు సిటీ: కర్నూలు లోని గాయత్రీ ఎస్టేట్ లో నూతనంగా ఏర్పాటు చేసిన వర్ణా స్కిన్ కేర్- హెయిర్ ట్రాన్స్ ప్లాంట్ ఆసుపత్రిని శనివారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రారంబించారు. డాక్టర్. విశ్వనాథ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్ణా ఆసుపత్రి ప్రజలకు మంచి సేవలు అందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. వర్ణా ఆసుపత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## మున్సిపల్ హైస్కూల్ ల లోని సమస్యలు పరిష్కరించాలి

మనగళం, కర్నూలు సిటీ: నెహ్రూ మెమోరియల్ స్కూల్, మునిసిపల్ హై స్కూల్ ల లోని సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నిర్మల, డి గౌస్ దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలో సిపిఎం ఆధ్వర్యంలో పాఠశాలల సమస్యలపై పర్యటన లో భాగంగా పార్టీ నగర కార్యదర్శి ఎం రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎం డి షరీఫ్ తో కలసి గౌస్ దేశాయ్, నిర్మల శనివారం ఈ పాఠశాలలను సందర్శించారు. నెహ్రూ మెమోరియల్ హై స్కూల్ నందు పీ ఈ టీ పోస్ట్ భర్తీ చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చదువుకోడానికి లైబ్రరీ కూడా లేదని కనీసం మ్యాగజీన్ లు పత్రికలు కూడా రావడం లేదని తెలియజేశారు. నెహ్రూ మెమోరియల్ స్కూల్ కాంపౌండ్ లో సచివాలయం ఉండడంతో విద్యార్థులకు చదువు లకు ఆటంకం (డిస్టబ్) అవుతోందని తక్షణమే, సచివాలయాన్ని వేరే ప్రాంతానికి మార్చాలని డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ హైస్కూల్లో టాయిలెట్లకు నీటి సరఫరా లేదని, రెండు బోర్లు వేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్ బాషా, షేక్ అహ్మద్, రసూల్ అహ్మద్, బాషా భాయ్ తదితరులు



## రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక




మనగళం, కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో సోమవారం(జూలై 28 ) ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు తమ సమస్యలపై వినతులు సమర్పించి పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం కర్నూలుతో పాటు అన్ని మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలోనూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు 1100 నెంబర్ కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

## డీఎస్పీల మృతిపై ఎంపీ బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతి

మనగళం, కర్నూలు సిటీ : తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి జిల్లాలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ కి చెందిన ఇద్దరు డీఎస్పీలు మృతి చెందడంపై కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశలలో భాగంగా ఢిల్లీలో ఉన్న అయన ఒక ప్రకటన ద్వారా మృతులకు సంతాపం తెలిపారు. ఓ కేసు విషయంలో విజయవాడ నుంచి హైదరాబాద్ కి వెళ్తున్న ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్ డీఎస్పీ లు చక్రధర్ రావు, శాంతారావు రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఇక ప్రమాదం లో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తునానన్న ఎంపీ నాగరాజు, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని తెలిపారు.



## కార్మిక హక్కుల సాధనే సీఐటీయూ లక్ష్యం

మనగళం, కర్నూలు సిటీ: కార్మిక హక్కల సాధనే సీఐటీయూ లక్ష్యమని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పీఎస్ రాధాకృష్ణ జిల్లా కన్వీనర్ కే సుధాకరప్ప తెలిపారు. కార్మిక కర్షక భవన్ లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పీఎస్ రాధాకృష్ణ మాట్లాడారు. జూలై 23 24 తేదీల్లో గుంటూరు నగరంలో జరిగిన ఏపీ బిల్డింగ్ ఆధార్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్, భవన నిర్మాణ కార్మిక సంఘం ఎనిమిదవ రాష్ట్ర మహాసభలో కర్నూలు జిల్లా నుండి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఆర్ నరసింహులు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎస్ కాజాబాషా ఎన్నిక అభినందనీయమన్నారు. జిల్లా నుండి ఎన్నికైన నాయకులు భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు కూటమి నేతలు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ప్రారంభిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు హాని చేసే లేబర్ కోడ్లు తీసుకొని వచ్చి పనిగంటలు పెంచాలని కేంద్రం చూస్తోందని, ఇందుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలని రాష్ట్ర మహాసభ తీర్మానించిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సాధన కోసం సెప్టెంబర్ 15వ తేదీన విజయవాడలోని లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడికి రాష్ట్ర కమిటీ పిలుపునివ్వడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించి కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి ఛలో విజయవాడ లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.




## ఆటంకాలు లేకుండా తాగునీటి సరఫరా

**– నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ :నగరంలోని సంతోష్ నగర్ వద్ద పైప్‌లైన్ లీకేజీ కారణంగా తాగునీటి సరఫరాకు ఏర్పడిన ఆటంకాలను త్వరితగతిన అధిగమించి, సాధారణ పరిస్థితులు తీసుకొచ్చేందుకు అధికారులు అవసరమైన చర్యలు ఎప్పటికప్పుడు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా ఇంజనీరింగ్ విభాగ అధికారులు, అమెనిటీస్ కార్యదర్శులతో తాగునీటి సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శు క్రవారం నుండి తాగునీటి సరఫరా ప్రారంభమవ్వగా, మూడు రోజులపాటు నీళ్ళు లేకపోవడం వల్ల దూర ప్రాంతాలకు నీళ్ళు వెళ్ళేందుకు సమయం పడుతుందన్నారు. ఫిర్యాదు చేసిన సుమారు 60 ప్రాంతాల ప్రజలకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల నీళ్ళను అందిస్తున్నామని, ఆదివారం రాత్రిలోపు నగర వ్యాప్తంగా తాగునీటి సరఫరా చక్కబడుతుందన్నారు. పరిస్థితి అదుపులో వచ్చేంతవరకు అధికారుల పర్యవేక్షణ నిరంతరాయంగా ఉండాలని కమిషనర్ ఆదేశించారు.

## పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలి

**– రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్ రెడ్డి డిమాండ్**

మనగళం, కర్నూలు సిటీ : కూటిమి సర్కార్ పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి, జిల్లాప్రధాన కార్యదర్శి జి ,రామకృష్ణ హెచ్చరించారు. కార్మిక కర్షక భవన్లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సంవత్సరం అత్యధికంగా రైతులు పొగాకు పంట సాగు చేయడం వలన కంపెనీలు రేటు పూర్తిగా దిగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో రూ. 18 వేలు ఉండగా ప్రస్తుతం రూ. 15 వేలు ఇస్తామని ప్రకటించినా అమలు కావడం లేదన్నారు. కేవలం రూ. 6 వేల లోపు ఇస్తున్నారని, దీంతో పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు, వెల్దుర్తి, ఎమ్మిగనూరు మండలాల్లో పొగాకు పంటను అధికంగా సాగు చేశారని, మంచి పంట వచ్చినప్పుటికి అమ్ముడు పోనందున రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే ఆందోళనలు చేసినప్పటికీ ఏ మాత్రం స్పందన లేదని విమర్శించారు. రైతుల సమస్యలపై ప్రజాప్రతినిధుల తీరు హాస్యాస్పదంగా ఉందని, రౌడీల్లా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డికి పత్రం అందజేయగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చెప్పారే తప్పా చేసిందేమీ లేదన్నారు. ఇదే సమస్యపై కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి వినతి పత్రం ఇవ్వాలని వెళ్లగా రైతులు, రైతు సంఘం నాయకులపై చాలా దురుసుగా వ్యవహరించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఎక్కువసేపు నిలబడితే మక్కిలు ఇరుగుతాయని అని అనడం ఒక ప్రజాప్రతినిధికి తగునా అని ప్రశ్నించారు. అంతేకాకుండా మీరంతా వైసీపీ వాళ్లని చెప్పడం హాస్యాస్పదం అని విమర్శించారు. రైతు సంఘం కార్యకర్తలపై ఎమ్మెల్యే అనుచరులు చెయ్యి చేసుకోనీకి పొగ అక్కడున్న పోలీసులు నివారించారని, ఇలాంటి చర్యలకు స్వస్తి చెప్పాలని హెచ్చరించారు. అదేవిధంగా యూరియా రైతులకు అవసరమైనంత అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పొగాకు రైతుల సమస్యలపై సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.




## సైబర్ నేరాలపై అవగాహన




మనగళం, కర్నూలు క్రైం : జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు శక్తి బృందాలు విద్యార్థులు, ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, శక్తీ బృందాల సిబ్బంది శనివారం పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలు, ఈవ్ టీజింగ్ లపై చైతన్య పరుస్తున్నారు. గుడ్ టచ్- బ్యాడ్ టచ్ మధ్య తేడా, స్వీయ రక్షణ పద్ధతులు, ఈవ్ టీజింగ్, ప్రేమ పేరుతో మోసాలు, మహిళలపై జరిగే నేరాలుపై, సమాజంలో ఆడపిల్లలు/మహిళలు/యువత ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చిస్తూ, బంగారు భవిష్యత్తు కోసం ఏవిధంగా ప్రవర్తించాలనే అంశాల గురించి వివరించారు. ఒకవేళ సైబర్ క్రైమ్ లో బాధితులయితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 ఫిర్యాదు చేయాలని సూచించారు.





## తాగునీటి సరఫరాపై అధికారుల పర్యవేక్షణ

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలను త్వరితగతిన తీసుకునేలా ఇంజనీరింగ్ విభాగ అధికారులు, అమెనిటీస్ కార్యదర్శులు సమన్వయంతో పర్యవేక్షించాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ ఆదేశించారు. శనివారం ఆయన అశోక్ నగర్ నీటి శుద్ధి కేంద్రాన్ని డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డితో కలిసి పరిశీలించారు. తాగునీటి ట్యాంకర్ల సరఫరాపై స్థితిపై ఆరా తీశారు. ఆదివారానికి సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ఎంఈలు మనోహర్ రెడ్డి, లీల ప్రసాద్, డిఈఈలు గిరిరాజ్, నరేష్, గంగాధర్, ఏఈలు జనార్ధన్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్

మన గళం,కర్నూలు క్రైం : జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్,కర్నూలు టౌన్ డిఎస్పీ జె.బాబు ప్రసాద్ ల ఆదేశాల మేరకు నగరంలో ట్రాఫిక్ పోలీసులు మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శనివారం నగరంలోని స్థానిక రాజవిహార్ సర్కిల్ లో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 15 మంది మైనర్లను గుర్తించి, వారిని ట్రాఫిక్ పి.యస్.కు తరలించి, అక్కడ వారికి వీడియోల ద్వారా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేసి, ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సి.ఐ.మన్సూరుద్దిన్, పోలీసులు పాల్గొన్నారు.



# ఘనంగా కార్గిల్ విజయ్ దివస్-2025

మన గళం,కర్నూలు బి.క్యాంప్ : భారత సైనిక చరిత్ర లో అత్యంత ముఖ్యమైన విజయాల్లో ఒక్కటైన జులై 26 న శనివారం కార్గిల్ విజయ్ దివస్ నగరంలో ని స్థానిక బి.క్యాంప్ లో ఉన్న జిల్లా సైనిక్ సంక్షేమ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎస్.ఆర్.రత్న రూత్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఈ దివస్ ను జరుపుకుంటున్నామన్నారు. 2025 లో 1999 కార్గిల్ యుద్ధంలో విజయం సాధించిన నేపథ్యంలో 26 వ వార్షికోత్సవాన్ని భారత ధేశమంతట జరుపుకుంటున్నారన్నారు. జమ్ము కశ్మీర్ లోని కార్గిల్ సెక్టార్ లో నియంత్రణ రేఖా వెంబడి శత్రు సైన్యం భారత భూభాగంలోకి చొరబడినప్పుడు మే1999 లో కార్గిల్ యుద్ధం ప్రారంభమైందన్నారు. ఈ యుద్ధమును ఆపరేషన్ విజయ్ గా ప్రకటించారన్నారు. ఈ ఆపరేషన్ లో భారత దేశము నుండి రెండులక్షల కంటే ఎక్కువ మంది సైనికులు పాల్గొని చివరికి టైగర్ హిల్, టోలోలింగ్ వంటి కీలక శిఖరాలను తిరిగి 26 జూలై 1999 న సాధించుకున్నామన్నారు. ఈ ఆపరేషన్ లో వీర మరణం పొందిన వీర సైనికులను స్మరించుకుంటూ, ఆపరేషన్ విజయ్ లో పాల్గొన్న మాజీ సైనికులను శాలువలు,మేమేంటోలతో ఆమె సత్కరించారు.



# ఎమ్ఈఓను సస్పెండ్ చేయాలి



మనగళం, మంత్రాలయం: మంత్రాలయం మండలంలో ప్రైవేట్ పాఠశాలలకు వత్తాసు పలుకుతున్న ఎమ్ఈఓ -1 ను సస్పెండ్ చేయాలని ఆర్ యూ ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్, రాష్ట్ర కార్యదర్శి షాహిద్ అఫ్రిది డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్ఆర్సీ కార్యాలయం ఎదుట ఎమ్ఈఓ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రాలయం మండలం లో ఉన్న జీనియస్ గ్లోబల్ స్కూల్ లో ప్రభుత్వం నిబంధనలు వ్యతిరేకంగా నవోదయ, గురుకుల, సైనిక్ కోచింగ్ సెంటర్ తోపాటు హాస్టల్ ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఈ కోచింగ్ సెంటర్ పేరిట తల్లితండ్రులు నుంచి వేలకు వేలు వసూలు చేస్తున్నారన్నారు. అయినా ఎమ్ఈఓ పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థులను బస్సులు వ్యాన్లు లో పరిమితికి మించి విద్యార్థులు ఎక్కించుకోవడం జరుగుతుందని,విద్యార్థులకు జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరని వారు ప్రశ్నించారు. జిల్లా విద్యాధికారులు ఎమ్ఈఓ ని తొలగించి విద్యార్థులు జీవితాలు కాపాడాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరిన్ని ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

# జాబ్ మేళాలో ఎంపికైన 61 మంది అభ్యర్థులు

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 61 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వివిధ స్థాయి ఉద్యోగుల భర్తీకి గాను జరిగిన జాబ్ మేళాలో 145 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు ధ్రువపాత్రాలను అందించారు. అనంతరం ఎంపికైన వారిని కళాశాల ప్రిన్సిపల్ షేక్షావలి అభినందించారు. వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకుంటే మెరుగైన అవకాశాలు పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్ ఎస్ డి సి స్టాఫ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ సాయి తేజ, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.





# జిల్లాలో 150 మి.మీ వర్షపాతం నమోదు

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : జిల్లా ఖరీఫ్ సాధారణ వర్షపాతం 401.1 మి.మీ. కాగా ఈ రోజు వరకు 150 మి.మీ వర్షపాతం నమోదైందని జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్ -2025 పంటకాలం యొక్క సాధారణ విస్తీర్ణం 4,22,540 హెక్టార్లు. జిల్లాలో ప్రత్తి , వేరుశనగ, కంది, మొక్కజొన్న, వరి, మినుము, ఉల్లి, మిరప మొదలైన ప్రధాన పంటలు సాగు అవుతున్నట్లు తెలిపారు. ఈ రోజు వరకు 2,48,432 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగు చేయడమైనది. ఇందులో ప్రధానంగా పత్తి పంట 1,83,050 హెక్టార్లలో సాగు చేయడమైనది. లి 26-07-2025 నాటికి జిల్లాలో 1140 మె.ట యూరియా లభ్యతలో ఉంది. ఇందులో ఏ.పీ మార్క్ ఫెడ్ వద్ద 268.78 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రాల వద్ద 165.4 మెట్రిక్ టన్నులు, రిటైలర్స్ దగ్గర 693.74 మెట్రిక్ టన్నులు, టోకుదారుల వద్ద 2.5 మెట్రిక్ టన్నులు, సహకార సంఘాలు మరియు మార్కెటింగ్ సొసైటీ దగ్గర 10.12 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు ప్రకటనలో తెలిపారు. రానున్న 3-4 రోజులలో 3000 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు సరఫరా కానుంది. అంతేకాకుండా ఆగస్టు మాసములో సమృద్ధిగా యూరియా సరఫరా కొరకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. విక్రయ కేంద్రాల వద్ద గుమికూడకుండా పంటకు అవసరమైన మేరకు మాత్రమే యూరియా కొనుగోలు చేయాలని సూచించారు. యురియాకు ప్రత్యామ్నాయముగా ఎన్‌పిఎన్‌ఓ యురియాను పంటలపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. : 500 మి.లీ/ఎకరాకు సరిపోతుందని, రూ. 225 చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయాల్లో ఎన్‌పిఎన్‌ఓ యురియా బాటిళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు యూరియా విషయములో ఎటువంటి ఆందోళన చెందవద్దని సూచించారు.

# శిథిలావస్థ భవనాల్లో విద్యార్థులను ఉంచొద్దు

- ఆళ్లగడ్డ గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్
- వసతి గృహ అధికారులపై ఆగ్రహం
- వెంటనే మార్చాలని హెచ్చరించిన ౕరాజకుమారి గణియా

మనగళం, నంద్యాల : ఆళ్లగడ్డలో శిథిలావస్థలో ఉన్న భవనంలో గిరిజన సంక్షేమ విద్యార్థులకు పాఠశాలను కొనసాగిస్తుండడంపై గిరిజన సంక్షేమ వసతి గృహ నిర్వాహకులు, ఇంజనీరింగ్ అధికారులపై జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం వేరొక గృహంలో వసతి, పాఠశాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఆళ్లగడ్డలోని గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా భవనాన్ని పరిశీలించారు. భవనం చాలా చోట్ల శిథిలావస్థకు వచ్చిందని, వెంటనే వసతి గృహంలో ఉన్న 192మంది విద్యార్థులను ఇళ్లకు పంపించి వేరొక వసతి గృహంలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వసతి గృహ అధికారులను ఆదేశించారు. జిల్లాలో అధిక వర్షాల వలన శిథిలావస్థలో ఉన్న భవనానికి ఏ సమయంలోనైనా ఏదైనా ప్రమాదం జరిగితే అందులో ఉన్న విద్యార్థుల పరిస్థితి ఏంటి అని సంక్షేమ వసతి గృహ అధికారులను ప్రశ్నించారు.ఆళ్లగడ్డ లోని కందుకూరు రోడ్డులో ఉన్న నూతన భవనంలోకి మార్చనున్నట్లు అధికారులు ఈ సందర్భంగా కలెక్టర్ కు వివరించారు. మార్చిన భవనంలో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని మౌలిక వసతులు ఉండేటట్టు చూడాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. అదేవిధంగా కందుకూరు రోడ్డు నందు నూతనంగా ఏర్పాటు చేస్తున్న గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని కలెక్టర్ పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టి పాఠశాలను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను, పాఠశాల సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని వసతి గృహాలలో ఏవైనా శిథిలావస్థలో ఉంటే విద్యార్థులను ఉంచకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం పడకండ్లలో శిథిలావస్థలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల ఆవరణం, వంట గది పరిశుభ్రంగా లేవని, పాఠశాల గదులన్నిటికీ చీలికలు, ప్యాచ్ వర్క్ ఉండడాన్ని గుర్తించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో అధిక శాతం వర్షపాతం నమోదవుతున్న కారణంగా వసతి గృహాలు నిర్వహిస్తున్న భవనాల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సంక్షేమ వసతి గృహ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ గుర్రప్ప, ఇంజనీరింగ్ విభాగపు అధికారులు, గురుకుల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# ఎక్స్ ఆఫీషియో సభ్యుడిగా బీటీ నాయుడు



మనగళం, ఆదోని : టీడీపీ కర్నూలు జిల్లా సీనియర్ నాయకుడు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి, శాసనమండలి సభ్యుడు బీటీ నాయుడిని ఆదోని మున్సిపల్ ఎక్స్ ఆఫిషియో సభ్యునిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆదోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఎక్స్ అఫీషియో మెంబర్ గా ప్రొటోకాల్ పాటించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కార్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆదోనిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంలో, నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు, క్యాబినెట్ మంత్రుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించుకునే నిబద్ధత, పట్టుదల కలిగిన ఎమ్మెల్సీ బీటీ నాయుడును ఆదోని మున్సిపల్ ఎక్స్ అఫీషియో మెంబర్గా నియమించడంపై నియోజకవర్గ ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

- జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



మనగళం, ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ మండలం, పడగండ్ల గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను శనివారం జిల్లా కలెక్టర్ జి రాజకుమారి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేందుకు తోడ్పడాలని సూచించారు. ఆదర్శ పాఠశాల అంటే ప్రతి అంశంలోనూ ఏ గ్రేడ్ లో ఉండాలన్నారు. పాఠశాల పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయని ఉపాధ్యాయులు చొరవ తీసుకొని పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మోడల్ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణులు అయ్యేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

# రైతులకు వారు సాగు చేసినటువంటి పంట పొలాలకు సంబంధించి శిక్షణ కార్యక్రమం

మన గళం కోడుమూరు: ఆత్మ వారి సౌజన్యంతో రైతులకు శిక్షణ కార్యక్రమం. ఈరోజు కోడుమూరు మండలంలోని పులకుర్తి గ్రామంలో ఆత్మా వారి ఆధ్వర్యంలో రైతులకు వారు సాగు చేసినటువంటి పంట పొలాలకు సంబంధించి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది.

డిఆర్సి (డిస్టిక్ రిసోర్స్ సెంటర్) ఏడిఏ, వెంకటేశ్వర్లు సార్ గారు మరియు ఉద్యాన అధికారి మదన్మోహన్ మరియు మండల వ్యవసాయ అధికారి ఎన్ రవి ప్రకాష్ మరియు ఆర్ఎస్కే సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొనడం జరిగినది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట పొలాలలో అవసరానికి మించి రసాయనకి ఎరువులు వాడకాన్ని తగ్గించాలని తెలపడమైనది పురుగుమందుల వాడకాన్ని తగ్గించి ఆర్గానిక్ విధానంలో వేప నూనె మరియు కషాయాలను వాడి పురుగుమందులను తగ్గించాలి విత్తనాల ఎంపికలో రైతులు ఎప్పటికప్పుడు మెలకువలను పాటించాలి భూసార పరీక్షల ఆధారంగా రసాయని చెరువులను వాడాలి గ్రామాలలో రైతులు అన్ని రకాల పంటలను సాగు చేయడం ద్వారా భూమి సారవంతం పెరుగునని తద్వారా మార్కెట్ ధరలు రైతుకు మంచిగా లభించునని ఒకే రకమైన పంటలను ఎక్కువ విస్తీర్ణాలలో సాగు చేయవద్దని తెలపడం అయినది ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మరియు స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు





ఆదివారం
27 - 07 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

మహిళా సాధికారత ఆవశ్యకత

ఎల్ఐసి కేవలం ఒక కార్పొరేట్ దిగ్గజం మాత్రమే కాదు, దేశాన్ని బాగా అర్థం చేసుకున్న విశిష్ట ప్రభుత్వ రంగ సంస్థ. మహిళలకు ఉపాధి కల్పనలో దాని స్థానం ప్రత్యేకం. 1960లలో భారతదేశంలో తాను అందించే పాలసీలు కేవలం బీమా రక్షణకే పరిమితము కాకుండా, సేవింగ్స్ అంశంపై కూడా ఎల్ఐసీ దృష్టి పెట్టింది. పిల్లల చదువులకూ, యువతుల పెళ్లిళ్లకూ అందివచ్చేలా మధ్యంతర, తుది చెల్లింపులు, బీమారక్షణ ఉండే పాలసీలను రూపొందించింది. సంస్థ చొరవ కారణంగా చాలా మంది గృహిణులు ఎల్ఐసి ఏజెన్సీ తీసుకుని విశేషంగా రాణించారు.ప్రస్తుతం ఎల్ఐసి సంస్థలో మొత్తం ఏజెంట్ల సంఖ్య 14.80 లక్షలు పైబడి కాగా , అందులో మహిళా ఏజెంట్ల సంఖ్య ఐదు లక్షలు పైమాటే.మూడేండ్లపాటు పరిమితులతో కూడిన స్టైఫెండ్‌ను చెల్లించే బీమా సఖి అనబడే ఒక ఉపాధి పథకం మహిళల కోసం ప్రత్యే కంగా జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) అమలు పరుస్తున్నది. 2024 డిసెంబర్ 9 ప్రధానమంత్రి చే ప్రారంభించబడిన ఈ పథకం కేవలం నిరు ద్యోగ మహిళలకోసం రూపొందించబడింది. ఈ మధ్యకాలంలో ఈ పథకం కింద 2 లక్షల పైగా మహిళా ఏజెంట్లను (2,05,896)ఎల్ఐసి నియమించింది.సౌత్ సెంట్రల్ జోన్ పరిధిలో (తెలంగాణ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్) ఇప్పటికే 45 వేల మంది బీమా సఖులుగా నియామకాలు పొందారు. ఐఆర్డీఏఐ నిబంధనలానుసారం ఈ పథకం కింద ఎల్ఐసిలో ఏజెన్సీ తీసుకుని నిర్దేశిత పరిమిత వ్యాపారం సేకరించిన ప్రతి ఒక్కరికీ మొదటియేడు రూ.7వేలు, రెండవయేడు రూ.6వేలు, మూడో యేడు రూ.5వేల స్టైఫెండ్ చెల్లించబడుతుంది. ఈ పథకం దేశంలోని నిరుద్యోగాన్ని రూపుమాపుతుందని చెప్పలేం గానీ అర్ధంతరంగా చదువును ఆపేసి ఉపాధి నిస్సహాయతలో ఉన్న ఔత్సాహికులకు ఇది మంచి అవకాశమని చెప్పవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత చదువులు మానేసిన చాలామంది సబలలకు తమను తాము మలచుకునేందుకు ఇది ఒక సదవకాశం. ఈ పథకాన్ని ప్రారంభించడానికీ, తదనంతర ప్రక్రియలకు ఎల్ఐసి వ్యయప్రయాసలకోర్చి ఉండవచ్చు. అయితే ఎల్ఐసి లక్ష్యాలలో భాగంగా గ్రామీణ ప్రాంతాలకు బీమా వ్యాపారాన్ని విస్తరింపజేయాలంటే బీమా సఖి ఒక మంచి ప్రయత్నమే. ఇందులో అంచెలంచెలుగా ఎదిగే అవకాశమూ ఉన్నది. వీరు ఐదేళ్లు ఏజెంట్‌గా పనిచేస్తే, అప్రెంటిస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అవడానికి అర్హత పొందుతారు.నిర్ణీత సర్వీసు, వయసూ దాటిన తర్వాత గ్రాట్యుటీ, వారసత్వ కమీషనూ లభించే వెసులుబాటూ ఉన్నది.గత ఆర్థిక సంవత్సరంలో బీమా సఖి పథకం ద్వారా రూ 62.36 కోట్లు చెల్లించిన ఎల్ఐసి,ఈ ఏడాది రూ 520 కోట్లు చెల్లించాలని లక్ష్యం పెట్టుకుంది.

కోవిడ్-19 మహమ్మారి బీమాను ప్రాథమిక ఆర్థిక అవసరంగా చూసేలా బీమా వైపు ప్రజల దృక్పథాన్ని మార్చింది. ఇండియా స్పెండ్ సర్వే ప్రకారం, భారతీయ కుటుంబాలు తమ ఆదాయంలో 39శాతం రుణ వాయిదాలపై, 32శాతం వారి అవసరాలకు, 29శాతం విచక్షణా వ్యయంపై ఖర్చు చేస్తాయి.అత్యల్ప నికర పొదుపు ఉన్నప్పటికీ, ఎల్ఐసి చక్కటి మార్కెటింగ్ వ్యూహంతో జీవిత బీమా రంగంలో ముందంజలో ఉంది.ప్రభుత్వరంగ బీమా సంస్థలు విస్తృత వర్గాల ప్రజలను చేరుకోవడానికి ప్రత్యేక మైన, తక్కువ ఖర్చుతో కూడిన, సులభంగా అర్థమయ్యే ఆరోగ్య ప్రణాళికలను రూపొందిస్తున్నాయి. సంఘటిత రంగ ఉపాధులలో మహిళా భాగస్వామ్యం దేశంలో నామమాత్రమే. అందుకే ఇలాంటి ప్రయత్నం ఆహ్వానించదగినదే. ప్రభుత్వ, ప్రయివేటు వ్యవస్థల్లోని సంఘటిత, అసంఘటిత రంగాలన్నీ ఇలాంటి ప్రయత్నాలకు శ్రీకారం చుట్టాలి. ఎందుకంటే నైపుణ్య లోపం యువతలో ఎక్కువవుతుండటం వల్ల ఉపాధి సాధన కష్టమౌతున్నదని అంతటా వినిపిస్తున్న రాగం. అందుచేత నైపుణ్య స్థాయిని బట్టి నూతనా విష్కరణల ద్వారా కొత్త ఉపాధిని కల్పిస్తే క్రమం తప్పని స్థిరత్వం ఏర్పడటం సులభం. కానీ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టీకరణల ద్వారా జరుగుతున్న ఉపాధి కల్పనలో మధ్యవర్తుల ప్రమేయం పెరిగి యాజమాన్యమిచ్చే మొత్తం పారితోషికంలో కోతలు పెట్టి చెల్లిస్తున్నారు. అంతే కాకుండా ఉన్న ఉపాధిలోనే జీవిత కాలం కొనసాగవలసి వస్తుంది. కానీ ప్రభుత్వ రంగంలో ఉపాధి పొందినప్పుడు పారితోషికంలో కోతలేవీ లేకపోవడమే కాకుండా కాలక్రమేణా రావలసిన ఎదుగుదలలో ఎలాంటి నష్టమూ ఉండదు. 65శాతం మంది భారతీయులు 35 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గలవారు. ఈ యువ మార్కెట్‌ను ఉపయో గించుకోవడానికి ,ఈ యువతరం విభిన్న అవసరా లను తీర్చడానికి, గ్రామీణ ప్రాంతాల్లో ఏజెంట్ల నైపుణ్యాలను పెంపొందించడానికి ఒక క్రమబద్ధమైన ప్రచారాన్ని పెంచడానికి, తద్వారా బీమా విస్తృతిని పెంచడానికి బీమా సఖి పథకం ఉపయోగపడవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో బీమా సఖి యోజనను ప్రోత్సహించడానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖతో ఎల్ఐసి ఒక అవగాహన ఒప్పందం కుదుర్చు కుంది. గ్రామీణ కుటుంబాలకు వారి కుటుంబ ఆదాయాన్ని మెరుగుపరచడం దీని ప్రధాన ఉద్దేశ్యం. బీమా ఉత్పత్తుల వినూత్న రూపకల్పనను ఎల్ఐసి చేపడుతున్న ఈ సందర్భం లో, బీమా సఖి ద్వారా నియామకాలు పొందిన వారు తమ కుటుంబ ఆదాయాలు పెంచుకోవడమే గాక, గ్రామీణ ప్రాంతాల్లో బీమా వ్యాప్తికి దోహద పడతారని ఆశిద్దాం.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

మనగళం, నంద్యాల : డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్, ఏపీ గుంటూరు ఆదేశాల మేరకు శనివారం నంద్యాల జిల్లా పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంలో సమాచారం హక్కు చట్టం - 2005 పై లాయర్ అడిగ శ్రీధర్ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా పట్టు పరిశ్రమ అధికారి నగేష్ హాజరు అయ్యారు. లాయర్ శ్రీధర్ విపులంగా సమాచార హక్కు చట్టం లోని అన్ని అంశాలను వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు దాని ప్రాధాన్యత ,అందులోని సెక్షన్స్ తదితర విషయాలను విశదీకరించారు. అడిగిన సమాచారం ఎలా ఇవ్వాలి,ఏమేమి ఇవ్వాలి, సీపీఏ రూల్స్, నూతన చట్టాలను వివరించారు. జిల్లా పట్టు పరిశ్రమ అధికారి నగేష్ మాట్లాడుతూ పట్టు పరిశ్రమ శాఖలో తప్పని సరిగా సమాచార హక్కు చట్టం అమలు చేస్తూ సకాలం లో సమాచారం అందించాలన్నారు.




## దివంగత ఎమ్మెల్యే శిఖామణి సేవలు అభినందనీయం

మనగళం, కోడుమూరు: రాజకీయ జీవితంలో మచ్చలేని వ్యక్తిగా గుర్తింపు పొందిన వ్యక్తి దివంగత ఎమ్మెల్యే శిఖామణి అని వైసీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్చార్జి కోట్ల హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు.శిఖామణి 17వ వర్ధంతి సందర్భంగా మునగల పాడు గ్రామంలోని ఘాట్ ను శనివారం టీడీపీ, వైసీపీ, జనసేన నాయకులు సందర్శించారు. శిఖామణి కుమారుడు, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, నాయకులతో కలిసి హర్షవర్ధన్ రెడ్డి శిఖామణి సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోట్ల హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడిగా గుర్తింపు పొందిన వ్యక్తి శిఖామణి అని కొనియాడారు. కోడుమూరు నియోజకవర్గంనీ అభివృద్ధి పథంలో నడిపించారని గుర్తు చేశారు. పేద, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి అంకితభావంతో పాటుపడ్డారన్నారు.ప్రజలకు శిఖామణిచేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు



## గడియారం హాస్పిటల్ ను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే సహించం

మనగళం, కార్పొరేషన్ : గడియారం హాస్పిటల్ అభివృద్ధి పేరుతో ప్రవేట్ సంస్థలకు, వ్యక్తులకు ఇస్తే అంగీకరించేది లేదని సీపీఎం నగర కార్యదర్శి ఎం రాజా శేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎం డి షరీఫ్, సయ్యద్ ఖాజా పాషా, మహబూబ్ బాషాలు ప్రభుత్వాన్నిహెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నగరంలోని పాతబస్తీ నందుగల గడియారం హాస్పిటల్ కు వంద సంవత్సరాల కు పైగ చరిత్ర ఉందన్నారు. ఈ ఆసుపత్రి ప్రభుత్వ సర్వజన హాస్పిటల్ కంటే ముందుగానే ప్రజలకు సేవలు అందించేదని గుర్తు చేశారు. అటువంటి ఘనమైన చరిత్ర కలిగిన ఆసుపత్రిని కూటమి ప్రభుత్వం, నగరపాలక సంస్థ అధికారులు కలిసి అభివృద్ధి పథంలో నడిపించి డాక్టర్లను సిబ్బందిని నియమించాల్సిన ఉందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు ,వ్యక్తులకు అప్పగిచ్చేందుకు కుట్రలు పన్నుతోందిని విమర్శించారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.




## మ్యుటేషన్ ను జాగ్రత్తగా నిర్వహించాలి



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఆటో మ్యుటేషన్ (యజమాని పేరు ఆన్లైన్లోనే మారడం) విధానాన్ని సచివాలయాల అడ్మిన్లు జాగ్రత్తగా నిర్వహించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. శనివారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో మ్యుటేషన్ విధానంపై అడ్మిన్లతో సమావేశం నిర్వహించారు. జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ మాట్లాడారు. మున్సిపల్ సేవల్లో పారదర్శకత పెంచేందుకు వీలుగా ఆగస్టు 1 నుండి ఆటో మ్యుటేషన్ ప్రక్రియను సరికొత్త విధానంలో అమలుల్లోకి తీసుకొస్తుందన్నారు. ఇందులో 4 రకాలుగా మ్యుటేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు. ఇళ్ళులు, ప్లాట్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయించుకున్న వెంటనే ఆన్లైన్ విధానంలో ఆటో మ్యుటేషన్ (ఆన్‌లైన్‌లో పేరుతో ఆస్తి బదలాయింపు) జరుగుతోందన్నారు. అదేవిధంగా ఆస్తి పన్ను విధింపునకు అడ్మిన్‌ల లాగిన్‌లకు దరఖాస్తులు వస్తాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రక్రియ పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ఆర్ఓ జునైద్, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రంలో జరిగిన అవినీతికంతా బాస్.. జగన్ రెడ్డే



(మనగళం, నెట్ వర్క్): అనంతపురం నగరంలో శనివారం నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటితో కలిసి టీడీపీ సంస్థాగత ఎన్నికల అబ్జర్వర్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు సోమిశెట్టి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అవినీతికంతా బాస్... జగన్ రెడ్డే అని విమర్శించారు. కూటమి సర్కార్ ప్రజలకు మేలు చేస్తుంటే వైసీపీ నేతలు ఓర్వలేక నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతపురం నియోజకవర్గానికి దగ్గుపాటి ప్రసాద్ లాంటి ఎమ్మెల్యే చాలా అవసరం అని చెప్పారు. పార్టీ కోసం, ప్రజల కోసం ఎమ్మెల్యే దగ్గుపాటి ఎంతో కష్టపడుతున్నారని కొనియాడారు. ప్రజలకు ఏం చేయాలి, నగరాన్ని ఎలా అభివృద్ధి చేయాలన్న తపన దగ్గుపాటిలో ఉందన్నారు. టీడీపీపై ప్రజలకు విశ్వాసం పెరిగిందని, మా కోసం పని చేసే ముఖ్యమంత్రి వచ్చాడని అంటున్నారని తెలిపారు.

## జలదుర్గంలో కొండ ముచ్చులు హల్చల్ వాటి బారి నుండి ప్రజలనుకాపాడండి. ఆవాజ్ కమిటీ

మన గళంప్యాపిలి మండలంలోని జలదుర్గం గ్రామములో కొండ ముచ్చుల నుండి ప్రజలను కాపాడాలని మండల కోఆప్షన్ మెంబర్ అవాజ్ అధ్యక్షుడు రసూల్ అధికారులను కోరారు. గ్రామములో 30 దాకా కొండముచ్చులు సంచరిస్తున్నాయని, నిన్నటి నుండి ఉమా నాగిరెడ్డి, నేసే శోభ, నేసే ఓబులేష్, కొలంట్ల రామానాయుడు తో పాటు 10 మంది రైతులను కొరికాయని, ఫారెస్ట్ అధికారులు, ఇప్పటి కైనా స్పందించి, గ్రామములో సంచరిస్తున్న కొండ ముచ్చులను అటవీ ప్రాంతానికి తరలించాలని రసూల్ అధికారులను విజ్ఞప్తి చేశారు.




## హాస్టల్లో రెగ్యులర్ వార్డెన్లు లేక పని వారి చేతివాటం పట్టించుకోని అధికారులు.. ఎన్ ఎస్ యు ఐ

మన గళండోన్ పట్టణంలోని 16వ వార్డులో ఉన్నటువంటి ఎస్సీ బాలికల వసతి గృహంలో రెగ్యులర్ వార్డెన్ లేకపోవడంతో అక్కడ ఉన్న పని వారు బియ్యాన్ని అమ్ముతూ చేతివాటం చూపిస్తున్నారని అలాగే అక్కడ విద్యార్థులకు సరైన సదుపాయాలు లేవని మరియు సీసీ కెమెరాలు లేకపోవడం వలన కూడా రక్షణలేమి కలుగుతుందని రెగ్యులర్ వార్డెన్ ని తప్పనిసరిగా నియమించాలని శనివారం డోన్ ఆర్ డి ఓ మరియు తాసిల్దార్ లకి ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో తెలుగు విజయ్ కుమార్, సుబ్బు యాదవ్, ఆర్ పి ఎస్ డోన్ మండల కోఆర్డినేటర్ బజారి లు వినతి పత్రం అందజేశారు..





ఆదివారం
27 - 07 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# ప్రేమ పయనంలో..

మన గళం,సినిమా : నరేష్ ఆగస్త్య, రబియా ఖాతూన్ జంటగా నటించిన చిత్రం 'మేఘాలు చెప్పిన ప్రేమకథ'. విపిన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఉమాదేవి కోట నిర్మాత. మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం ఆగస్ట్ 22న విడుదల కానుంది. శుక్రవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇదని..వినోదం, భావోద్వేగాలు ప్రధానంగా ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు. ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో పాటు హృదయాన్ని స్పృశించే ప్రేమకథతో ఈ సినిమా అందరినీ మెప్పిస్తుందని హీరో నరేష్ ఆగస్త్య అన్నారు. రాధిక శరత్‌కుమార్, తనికెళ్ల భరణి, విద్యుల్లేఖ, సుమన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జస్టిన్ ప్రభాకరన్, రచన-దర్శకత్వం: విపిన్.




## ఆ దర్శకుడి చేతికి ఆదిత్య 999..?

మన గళం,సినిమా : బాలకృష్ణ 'ఆదిత్య 999' ఎప్పుడు మొదలుపెడతారు..?.. అభిమానుల్ని చాన్నాళ్లుగా వెంటాడుతున్న ప్రశ్న ఇది. ఈ సినిమాకు తానే దర్శకత్వం వహించనున్నట్టు గతంలో బాలకృష్ణ ప్రకటించారు కూడా. అయితే.. ఇప్పుడు బాలయ్య తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. 'ఆదిత్య 999' బాధ్యతను వేరొక దర్శకుడి చేతిలో పెట్టారు. ఆ దర్శకుడెవరో కాదు. బాలకృష్ణ వందవ చిత్రం 'గౌతమీపుత్ర శాతకర్ణి'ని అద్భుత విజయంగా మలిచిన క్రిష్ జాగర్లమూడే ఆ దర్శకుడు. ప్రస్తుతం బాలకృష్ణ 'అఖండ 2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఆ తర్వాత మలినేని గోపీచంద్ సినిమాను ఆయన పట్టాలెక్కించనున్నారు. ఆ సినిమాతో పాటే 'ఆదిత్య 999'ని కూడా సమాంతరంగా చేసేందుకు బాలయ్య నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. మరో విశేషం ఏంటంటే.. 'ఆదిత్య 999'తోనే తన నట వారసుడు మోక్షజ్ఞను ఇంట్రడ్యూస్ చేయనున్నారు బాలకృష్ణ. దీనికి సంబంధించిన సన్నాహాలు శరవేగంగా జరుగుతున్నాయి. మరోవైపు క్రిష్ కూడా ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్‌లో బిజీ అయిపోయారు. అటు మలినేని గోపీచంద్ సినిమాకు, ఇటు 'ఆదిత్య 999'కు.. రెండు సినిమాలకూ సంభాషణలు అందించేది సాయిమాధవ్ బుర్రానే కావడం మరో విశేషం.






## హీరో ఆరడుగులున్నా డోంట్‌కేర్..

మన గళం,సినిమా : 'ఎత్తు అనేది పెద్ద సమస్యేం కాదు. అదే సమస్య అనుకుంటే రష్మిక నేషనల్ క్రష్ అయ్యేదా..? నిత్యామీనన్ ఇంతమందికి అభిమాన నటిగా ఎదిగేదా..?' అంటూ అంతెత్తు లేచించి తమిళ అందం ఇవానా. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో 'మన హీరోల్లో ఎక్కువమంది టాల్ బాయ్స్ కదా..! మీరేమో షార్ట్.. ఇబ్బంది కాదా..? అని ఓ విలేకరి అడగ్గా ఆమె పై విధంగా స్పందించారు. ఇంకా చెబుతూ 'హీరో ఎంత హైట్ ఉన్నా మేనేజ్ చేయగల కెపాసిటీ నాకుంది. నటికి టాలెంట్ ముఖ్యం. హావభావాలతో, అందంతో మెప్పించడం ముఖ్యం. తెరపై ఎత్తును ఎవరూ చూడరు. ఎవర్ని ఎలా చూపించాలనేది డీవోపి చేతిలో ఉంటుంది. ఇప్పుడున్న టెక్నాలజీకి నన్ను హైట్‌గా చూపించడం పెద్ద పనేం కాదు. ఆరడుగుల హీరో పక్కన కూడా నటించి మెప్పించగల సామర్థ్యం నాకుంది.' అంటూ చెప్పుకొచ్చింది ఇవానా. 'లవ్‌టుడే' సినిమాతో తెలుగులోనూ గుర్తింపు తెచ్చుకున్న ఈ అందాలభామ.. రీసెంట్‌గా 'సింగిల్' సినిమాతో తెలుగులో నేరుగా విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం త్రినాథరావు నక్కిన సినిమాలో కథానాయికగా ఇవానా ఎంపికైనట్టు వార్తలొస్తున్నాయి.

## ప్రత్యేక గీతంతో విశ్వంభర పూర్తి

మన గళం,సినిమా : అగ్ర కథానాయకుడు చిరంజీవి నటిస్తున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' చిత్రీకరణ పూర్తి చేసుకుంది. చిరంజీవి, బాలీవుడ్ నాయిక మౌనిరాయ్‌లపై తెరకెక్కించిన ప్రత్యేకగీతంతో షూటింగ్ కంప్లీట్ చేశామని మేకర్స్ తెలిపారు. వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఈ స్పెషల్‌సాంగ్‌కు భీమ్స్ సిసిరోలియో స్వరాల్ని సమకూర్చగా కాసర్ల శ్యామ్ రచించారు. గణేష్ ఆచార్య నృత్యరీతుల్ని అందించిన ఈ పాటను వందమంది డ్యాన్సర్లతో గ్రాండ్‌గా తెరకెక్కించామని, చిరంజీవి తన సిగ్నేచర్ స్టెప్స్‌తో అదరగొట్టారని చిత్రబృందం పేర్కొంది. బ్రహ్మదేవుడు ఉండే సత్యలోకం నేపథ్య కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు వశిష్ట పేర్కొన్న విషయం తెలిసిందే. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం.కీరవాణి, భీమ్స్ సిసిరోలియో, రచన-దర్శకత్వం: వశిష్ట.







## ఈ హాట్ బ్యూటీ అందానికి ఎవరైనా పడిపోవాల్సిందే

మన గళం,సినిమా : ఎన్టీఆర్ ఇటీవలే దేవర సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. డైరెక్టర్ కొరటాల శివ దర్శకత్వం వహించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టింది. ఇందులో తారక్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటించింది. ఈ సినిమా తర్వాత తారక్ ప్రస్తుతం వార్ 2 చిత్రంలో నటిస్తున్నారు. ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా నందమూరి అభిమానులకు మంచి కిక్ ఇచ్చింది. కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. దేవర సినిమాను రెండు భాగాలూ ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ క్రమంలో దేవర 1 ను సెప్టెంబర్ 27న గ్రాండ్ గా విడుదల చేశారు. కాగా ఈ సినిమా సంచలన విజయాన్ని అందుకుంది. దేవర సినిమాతో తారక్ నయా రికార్డ్ క్రియేట్ చేశాడు. ఇక దేవర సినిమాలో బాలీవుడ్ బ్యూటీ జాన్వికపూర్ హీరోయిన్ గా నటించింది. అలాగే బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీ ఖాన్ విలన్ గా నటించారు. దేవర ఘనవిజయం సాధించడంతో ప్రేక్షకులు ఫుల్ ఖుష్ అవుతున్నారు. ఇదిలా ఉంటే దేవర సినిమాలో నటీ నటుల్లో లతా విశ్వనాథ్ రెడ్డి ఒకరు. ఈ అమ్మడు దేవర సినిమాలో కనిపించింది కొంత సేపే అయినా కూడా చాలా మందికి ఫేవరెట్‌గా మారిపోయింది ఈ చిన్నది. చాలా సినిమాల్లో ఈ చిన్నది ఆర్టిస్ట్ గా చిన్న చిన్న పాత్రలు చేసింది. కానీ దేవర సినిమాతో లతా విశ్వనాథ్ రెడ్డికి మంచి క్రేజ్ వచ్చింది. చాల ఏమండీ ఈ ముద్దుగుమ్మ కోసం గూగుల్ లో గాలించారు. లతా విశ్వనాథ్ రెడ్డి సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా హాట్ ఫొటోలతో నెటిజన్స్ ను కవ్విస్తుంది.

తాజాగా ఈ చిన్నది ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఆమె మాట్లాడుతూ.. ఎన్టీఆర్ తన ఫేవరెట్ హీరో అని తెలిపింది. దేవర సినిమాలో నటించడం అదృష్టం అని తెలిపిన ఈ అమ్మడు ఎన్టీఆర్ తో సీన్స్ లేకవడం బాధగా అనిపించింది అని తెలిపింది. ఎన్టీఆర్ సరసన హీరోయిన్ గా నటించాలని కోరుకుంటున్నానని చెప్పుకొచ్చింది ఈ ముద్దుగుమ్మ అలాగే.. కాంతారా హీరో రిషబ్ శెట్టి సరసన రొమాన్స్ చేయాలని తన మనసులోని మాట బయట పెట్టింది. ప్రస్తుతం వరుస అవకాశాలు వస్తున్నాయని తెలిపింది. సినిమాలలో, వెబ్ సిరీస్ లలో అవకాశాలు వస్తున్నాయని, అలాగే లీడ్ రోల్స్ కూడా వస్తున్నాయని..లీడ్ రోల్స్, సైడ్ హీరోయిన్, స్పెషల్ సాంగ్స్ ఛాన్స్ లు వస్తున్నాయని.. ఎలాంటి రోల్స్ అయినా సరే తాను సిద్ధం అంటుంది ఈ భామ. ఎక్స్పోజింగ్ పాత్రలో నటించడం కాస్త ఇబ్బందిగా ఉన్న.. తనకు నటన వచ్చు కాబట్టి ఈజీనే అని చెప్పుకొచ్చింది ఈ ముద్దుగుమ్మ.





## భారత్‌పై రూట్ సెంచరీల పండుగ.. రెండో స్థానం అతడిదే..!



మన గళం, ఇంగ్లండ్ స్టార్ జో రూట్ బ్యాట్ నుంచి మరో సెంచరీ జాలువారింది. అది కూడా తనకెంతో ఇష్టమైన ప్రత్యర్థి అయిన భారత జట్టుపై శతకంతో మురిసిపోయాడు రూట్. మాంచెస్టర్ టెస్టులో విలువైన ఇన్నింగ్స్ ఆడిన ఈ క్లాసిక్ ఆటగాడు.. టీమిండియా మీద 12వ సారి మూడంకెల స్కోర్‌తో చరిత్ర సృష్టించాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడు వందకు చేరువవ్వడం ఇది 38వ సారి కావడం విశేషం. లంచ్ తర్వాత అన్షుల్ కంభోజ్ ఓవర్లో ఫైన్ లెగ్‌లో బౌండరీతో శతక సంబురం చేసుకున్నాడు రూట్. ప్రస్తుతం రూట్ భారత్‌పై శతక వీరుల జాబితాలో టాప్‌లో ఉండగా.. ఆస్ట్రేలియా ఆటగాడు స్టీవ్ స్మిత్ 11 సెంచరీలతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. స్వదేశంలో ఇండియాపై 9 పర్యాయాలు శతకంతో రెచ్చిపోయిన రూట్.. టీమిండియా పర్యటనలో మూడుసార్లు వందతో రాణించాడు. ఇంగ్లండ్ తరఫున అత్యధిక శతకాల వీరుడిగా చరిత్ర సృష్టించిన రూట్.. మాంచెస్టర్ టెస్టులో మరో మైలురాయిని అధిగమించాడు. స్వదేశంలో భారత్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో పరుగుల వరద పారిస్తున్న రూట్.. జాక్వెస్ కలిస్‌ను దాటేశాడు. మాంచెస్టర్ టెస్టులో మూడో రోజు 32 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అతడీ ఘనత సాధించాడు. దక్షిణాఫ్రికా వెటరన్ 13,289 రన్స్‌తో మూడో స్థానంలో ఉండగా.. రూట్ అతడిని అధిగమించాడు.

## సుందర్ డబుల్ ధమాకా.. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ ఆధిక్యం

మన గళం, లార్డ్స్‌లో బంతితో మాయ చేసిన వాషింగ్టన్ సుందర్ (2-23) మాంచెస్టర్ టెస్టులోనూ మెరిశాడు. మూడోరోజు లంచ్ తర్వాత ఇంగ్లండ్‌ను గట్టి దెబ్బకొట్టాడు వాషీ. తొలి సెషన్ నుంచి క్రీజులో పాతుకుపోయిన ఓలీ పోప్(71)ను ఔట్ చేసి భారత్‌కు బ్రేకిచ్చాడు. ఆ కాసేపటికే డేంజరస్ హ్యారీ బ్రూక్(3)ను వెనక్కి పంపి ఇంగ్లండ్ స్కోర్ వేగాన్ని తగ్గించాడు. స్వల్ప వ్యవధిలో రెండు కీలక వికెట్లు పడినందున జో రూట్ (83) కెప్టెన్ బెన్ స్టోక్స్(4)లు జాగ్రత్తగా ఆడుతున్నారు. మరో ఎండ్‌లో జడేజా సైతం కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తుండడంతో ఇద్దరూ రన్స్ తీసేందుకు కష్టపడుతున్నారు. ప్రస్తుతానికి ఇంగ్లండ్ 5 పరుగుల ఆధిక్యంలో ఉంది. మాంచెస్టర్ టెస్టులో ఇంగ్లండ్ జట్టు పటిష్టి స్థితిలో నిలిచింది. రెండో రోజు బజ్ బాల్ ఆటతో ఓపెనర్లు బెన్ డకెట్(94), జాక్ క్రాలే(84)లు విధ్వంసం సృష్టించగా.. మూడో రోజు మిడిలార్డర్ క్రీజులో పాతుకుపోయారు. జో రూట్ (63 నాటౌట్), ఓలీ పోప్(70 నాటౌట్)లు భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ అర్ధ శతకాలతో చెలరేగారు. పేస్ దళం లో బౌన్స్‌తో ఇబ్బంది పెట్టినా వెరవని ఈ ద్వయం మూడో వికెట్‌కు రన్స్ జోడించింది. లంచ్ సమయానికి ఆతిథ్య జట్టు 2 వికెట్ల నష్టానికి 332 రన్స్ కొట్టింది.



## మైనర్‌పై అత్యాచారం పేసర్ యశ్ దయాళ్‌పై ఎఫ్ఐఆం

మన గళం, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) పేసర్ యశ్ దయాళ్‌పై మరో అత్యాచారం కేసు నమోదైంది. ఈమేరకు జైపూర్ పోలీసులు అతడిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. పోలీసులు అందించిన వివరాల మేరకు..యశ్ దయాళ్ తొలిసారి 2023లో 17 ఏళ్ల బాలికపై అత్యాచారం చేశాడు. క్రికెటర్‌గా ఎదిగేందుకు సాయం చేస్తాననే సాకుతో దయాళ్ పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడట. ఈమేరకు బాలిక చేసిన ఫిర్యాదుతో భారత న్యాయ సంహితలోని సెక్షన్ 64తోపాటు, పోక్సో చట్టం కింద 27 ఏళ్ల యశ్ దయాళ్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కాగా దయాళ్‌పై అత్యాచారం కేసు నమోదు కావడం ఇది రెండోసారి. యూపీకి చెందిన ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని ఐదేళ్లపాటు ఆమెతో సహజీవనం చేసి మోసం చేసిన కేసులో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు.



## సెమీస్‌లో సాత్విక్ జోడీ ముగిసిన ఉన్నతి పోరుజూ చైనా ఓపెన్

మన గళం, చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి జోడీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. అయితే మహిళల సింగిల్స్‌లో వర్ధమాన షట్లర్ ఉన్నతి హుడా పయనం ముగిసింది. డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్/చిరాగ్ జోడీ 21-18, 21-14తో మలేసియా జంట ఆంగ్ యూ సిన్/టో యీ యీని చిత్తు చేసింది. ఇక పీవీ సింధుకు ప్రీక్వార్టర్ ఫైనల్లో షాకిచ్చిన ఉన్నతి..వరల్డ్ నెం. 4 అకానె యమగూచి చేతిలో పరాజయం చవిచూసింది. క్వార్టర్‌ఫైనల్లో హుడా 16-21, 12-21తో యమగూచి (జపాన్) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.






Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310